సాక్షి
వనపర్తి
మంగళవారం। 2। సెప్టెంబర్। 2025



జలాశయాలకు వరద

ఉమ్మడి జిల్లాలోని జూరాల, సుంకేసుల, శ్రీశైలం జలాశయాలకు వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది.

-10లో ▸



పోరాట యోధుడు.. సురవరం

సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి గొప్ప పోరాట యోధుడు అని చాడ వెంకట్‌రెడ్డి అన్నారు.

-10లో ▸

గరిష్టం/కనిష్టం
33.2 /22.6

వాతావరణం

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గిరిజన రైతులపై కేసులు ఎత్తివేయాలి



పాన్‌గల్‌: గిరిజన రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు డిమాండ్‌ చేశారు. సోమవారం మండలంలోని కిష్టాపూర్‌తండాలో పోడు భూములు సాగుచేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని, వారిపై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని కోరుతూ వివిధ రూపాల్లో గిరిజన రైతులు చేస్తున్న పోరాటానికి సీపీఎం బృందం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కిష్టాపూర్‌తండాలో సర్వే నెం.34లో 12 ఎకరాల భూమిని 25 మంది గిరిజన రైతులు 70 ఏళ్లుగా సాగు చేస్తున్నారన్నారు. పోడు భూములు సాగుచేసుకుంటున్న రైతులపై అకారణంగా అటవీశాఖ అధికారులు కేసులు నమోదు చేయించారని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తండాను సందర్శించి సమగ్ర విచారణ జరిపి గిరిజన రైతులకు న్యాయం చేయాలని కోరారు. లేకపోతే పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. బాల్యానాయక్‌, వెంకటయ్య, వేణుగోపాల్‌, ఎం.వెంకటయ్య, చంద్రశేఖర్‌, కోదండరాములు, నిరంజన్‌, కృష్ణయ్య, గిరిజన రైతులు పాల్గొన్నారు.

వనపర్తి అథ్లెట్ల పతకాల పంట

వనపర్తి టౌన్‌: మహబూబ్‌నగర్‌లోని పాలమూరు యూనివర్సిటీలో ఆగస్టు 30, 31 తేదీల్లో నిర్వహించిన 11వ తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్‌ అథ్లెటిక్స్‌ చాంపియన్‌షిప్‌ పోటీల్లో జిల్లాకు చెందిన అథ్లెట్లు 7 పతకాలు సాధించారని జిల్లా అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి నందిమళ్ల శ్రీకాంత్‌ తెలిపారు. లావణ్య బంగారు పతకం, మల్లేష్‌ 60 మీటర్ల పరుగు పందెంలో బ్రాంజ్‌ మెడల్‌, రవీందర్‌, సిద్ధార్థ షాట్‌పుట్‌లో బ్రాంజ్‌ మెడల్‌, నందిని 5వేల మీటర్ల పరుగు పందెంలో బ్రాంజ్‌ మెడల్‌, బద్దు నాయక్‌ 5వేల మీటర్ల రేస్‌వాక్‌లో బ్రాంజ్‌ మెడల్‌, చరణ్‌ లాంగ్‌జంప్‌లో బ్రాంజ్‌ మెడల్‌ సాధించారు. క్రీడాకారులను జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీధర్‌, గౌరవ అధ్యక్షుడు బొలెమోని నరసింహ, ఉపాధ్యక్షుడు షంషీర్‌ అలీ, బోలమోని రాంచందర్‌, మండ్ల కుర్మయ్య, కోశాధికారి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు అభినందించారు.

పారిశుద్ధ్యంపై ముందడుగు

మున్సిపాలిటీలో కొత్తగా ఆటోలు, ట్రాక్టర్ల కొనుగోలుకు నిర్ణయం



వనపర్తి మున్సిపాలిటీలో చెత్త సేకరిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

- జనాభాకు అనుగుణంగా పెరగనున్న చెత్త సేకరణ వాహనాలు
- పుర ప్రజలకు తప్పనున్న అవస్థలు
- సిబ్బంది పెరిగితే మరింత మెరుగ్గా పారిశుద్ధ్య నిర్వహణ
- టెండర్లు పూర్తయినా ఇంకా రాని వాహనాలు

వనపర్తి టౌన్‌: స్థానిక మున్సిపాలిటీలో ఇంటింటి చెత్త సేకరణలో వేగం పెంచేందుకు పురపాలక శాఖ అడుగులేస్తుంది. పట్టణంతో పాటు నాలుగు విలీన గ్రామాలు ఉండడంతో మున్సిపాలిటీ పరిధి రోజురోజుకూ విస్తరిస్తోంది. ప్రతి నివాసం, కమర్షియల్‌ దుకాణంలో చెత్తను సేకరించేందుకు మున్సిపాలిటీకి తలకుమించిన భారంగా మారింది. పట్టణంలో అధికారుల లెక్కల ప్రకారం నివాసాలు, కమర్షియల్‌ దుకాణాలు కలిపి 20వేలకు పైగా ఉన్నాయి. దీంట్లో లెక్కకు రాని నివాసాలు సైతం అనేకంగా ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

కొత్త వాహనాలకు మొగ్గు

పురపాలికలో చెత్త సేకరణలో కలుగుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు కొత్త వాహనాలను కొనుగోలు చేయాలని మున్సిపల్‌ యంత్రాంగం నిర్ణయించారు. ఈ మేరకు సుమారు రూ.60.5 లక్షల అంచనాతో 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి 3 ట్రాక్టర్లు, 3 ట్రాలీలు, 3 ఆటోలు కొనుగోలు చేసేందుకు ఉన్నతాధికారుల నుంచి అనుమతి పొందారు. ఈ మేరకు ఆటోలకు రూ. 27.50 లక్షలు, ట్రాక్టర్లు, ట్రాలీలకు రూ.33లక్షల చొప్పున ఖర్చు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం సిబ్బంది నియామకం లేని కారణంగా అదనపు ఆటోలకు, ట్రాక్టర్లకు ఉన్న సిబ్బందిలో డ్రైవింగ్‌ లైసెన్స్‌ కలిగిన వారికి డ్రైవర్‌ హోదా, జీతాన్ని ఇచ్చి కొత్త వాహనాలను నడిపించాలనే ఆలోచనలో అధికారులు ఉన్నారు. ఒకవేళ ఇలాగే ముందుకెళ్తే పారిశుద్ధ్య సిబ్బందిపై పనిభారం మరింత పెరగనుంది.

వారంలో ట్రాక్టర్‌లు



ఇంటింటి చెత్త సేకరణకు అనువుగా ట్రాక్టర్‌లను, ఆటోలను కొనుగోలుకు టెండర్‌లు పిలిచాం. వారం రోజుల్లో ట్రాక్టర్‌లు, ట్రాలీలు వస్తాయి. ఆటోలు తయారు అవుతున్నందున మరో 15 రోజులు పడుతుంది. టెండర్‌ దక్కించుకున్న వారు నాకు తెలిసిన వాళ్లు, బంధువులు కానే కాదు.

– యునూస్‌, డీఈ వనపర్తి మున్సిపాలిటీ.

కొనుగోలుపై తాత్సారం

మూడు నెలల కిందట వాహనాల కొనుగోలుకు ఇంజినీరింగ్‌ విభాగం నుంచి ప్రతిపాదనలు రూపొందించినప్పటికీ ఇప్పటి వరకు కార్యాచరణలో ముందడుగు పడటం లేదు. మున్సిపల్‌ డీఈ యునోస్‌ వీటి పురోగతిపై పెద్దగా పట్టించుకోకపోవడంతో ఆ ప్రభావం చెత్త సేకరణపై పడుతోంది. ఉన్నతాధికారులు సైతం ఈ అంశంపై దృష్టి సారించకపోవడంతో సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారింది.

17 వాహనాల ద్వారా..

మున్సిపాలిటీ పరిధిలో 13 ట్రాక్టర్లు, 4 ఆటోలు కలిపి 17వాహనాల ద్వారా 50 మంది కార్మికులు చెత్త సేకరణ, దుర్గంధం ఎత్తిపోసే విధులు నిర్వహిస్తున్నారు. దీనికి తోడు ప్రైవేట్‌ ఏజెన్సీ ద్వారా 10ఆటోలు చెత్తను సేకరిస్తున్నాయి. ఈ మేరకు పట్టణంలో ప్రతి రోజు 20 మెట్రిక్‌ టన్నుల చెత్త సేకరణ జరుగుతోంది. ఏళ్ల కిందట ఉన్న సిబ్బంది, వాహనాలతోనే అన్ని ప్రాంతాల్లో చెత్త సేకరణ చేపడుతుండటంతో సకాలంలో ఇంటింటి చెత్త సేకరణ చేయలేకపోతుంది. ఈ క్రమంలో పుర పరిధిలోని నివాసాల్లో తడి, పొడి చెత్త పేరుకుపోతుండటంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుంది. ఒక్కో వార్డుల్లో ఐదారు వీధుల ఉండటంతో రోజుకు 2, 3 వార్డులు తిరగ్గానే సిబ్బంది సమయం ముగిసిపోతుంది. ఈ క్రమంలో ఒక్కొక్క వార్డులో ఇంటింటి చెత్త సేకరణకు వారానికి ఒకటి, రెండు సార్లే ట్రాక్టర్‌ వెళ్తుతుంది. దీనికి తోడు ప్రధాన, వరద కాల్వ, అంతర్గత రహదారుల డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్త, దుర్గంధాన్ని వెలికితీసి శివారు ప్రాంతాలకు తరలించేందుకు సైతం ఇంటింటి చెత్త సేకరణ ట్రాక్టర్లే వాడుతుండటంతో పుర పరిధిలో ఆశించిన స్థాయిలో పారిశుద్ధ్య పనులు జరగడం లేదనే అపవాదు ఉంది. ప్రధాన రాజకీయ పార్టీ ముఖ్య నాయకుల ప్రాంతాల్లో తప్పితే మిగతా ప్రాంతాల్లో చెత్త సేకరణ, దుర్గంధం తొలగింపు పనులు పూర్తి స్థాయిలో చేయట్లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిని అధిగమించేందుకు అధికార యంత్రాంగం శతవిధాల ప్రయత్నిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పెద్దగా మార్పు కనిపించడం లేదు.



ప్రస్తుతం మున్సిపాలిటీలోని చెత్త సేకరించే వాహనాలు

గంజాయి రహిత జిల్లాగా మారుద్దాం



మాట్లాడుతున్న కలెక్టర్‌ ఆదర్శ్‌సురభి

- కలెక్టర్‌ ఆదర్శ్‌ సురభి

వనపర్తి: జిల్లాలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు ఉత్పత్తి చేయడం, వినియోగించడం కానీ జరుగకుండా కట్టుదిట్టమైన నిఘా పెట్టాలని కలెక్టర్‌ ఆదర్శ్‌సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో కలెక్టర్‌ అధ్యక్షతన నిర్వహించిన జిల్లాస్థాయి నార్కోటిక్‌ సమన్వయ సమావేశంలో సంబంధిత శాఖల నుంచి అధికారులు నివేదిక సమర్పించారు. మాదక ద్రవ్యాల సరఫరాపై పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో ఉన్న క్యాంటీన్లు, పాన్‌షాప్‌లు, వైన్‌ షాపుల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ నిఘా పెట్టాలని ఎక్సైజ్‌, డ్రగ్‌ తనిఖీ అధికారులకు సూచించారు. జిల్లాలోని కళాశాలల్లో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్‌ కమిటీలను క్రియాశీలంగా మార్చి, ప్రతి నెల మొదటి శుక్రవారం యాంటీ డ్రగ్‌ సమావేశాలు నిర్వహించాలని, విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని ఇంటర్మీడియట్‌ నోడల్‌ అధికారి, జిల్లా విద్యా శాఖ అధికారిని ఆదేశించారు.

జిల్లాలో 6 కేసులు

2025 సంవత్సరంలో ఇప్పటి వరకు వనపర్తి పట్టణంలో 2, గోపాల్‌పేట మండలంలో 2, పెబ్బేరులో 2 కేసులు కలిపి మొత్తం 6 కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. మాదక ద్రవ్యాలు వినియోగించే వారిపై, సరఫరా చేసే వారిపై, గంజాయి పండించే వారిపై స్టాండర్డ్‌ ఆపరేటింగ్‌ ప్రొసీజర్‌ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటీవల శిక్షణ పొందిన పోలీస్‌ శునకాలు మాదక ద్రవ్యాలను సులువుగా గుర్తిస్తున్నాయని, వీటి సహాయంతో అనుమానం వస్తే కళాశాలల్లోనూ తనిఖీలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్‌ రెవెన్యూ ఎన్‌.ఖీమ్యానాయక్‌, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌ యాదయ్య, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ బి.శ్రీనివాస్‌, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించండి

ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్‌ ఆదర్శ్‌ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌ రెవెన్యూ ఖీమ్యానాయక్‌, అదనపు కలెక్టర్‌ స్థానిక సంస్థలు యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యంతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజావాణికి 36 ఫిర్యాదులు వచ్చినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు.

బడుగుల అభ్యున్నతే కాంగ్రెస్‌ లక్ష్యం



సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం, ముఖ్య నాయకుల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

వనపర్తి టౌన్‌: బడుగుల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్‌ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీలకు అనుగుణంగా పాలన సాగిస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్‌ అన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టడంపై హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌ చౌరస్తాలో డీసీసీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్‌ జి.చిన్నారెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్‌ మాట్లాడుతూ గత ప్రభుత్వం బీసీలను ఓటు బ్యాంకు రాజకీయాలకు మాత్రమే వాడుకుందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా బడుగులు అభ్యున్నతి చెందాలనే రాహుల్‌గాంధీ లక్ష్యాలకు అనుగుణంగా కాంగ్రెస్‌ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్‌ ద్వారా విద్యా, ఉద్యోగ రాజకీయాల్లో తగిన ప్రాధాన్యత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతకు ముందు రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రెడ్డి, రాగివేణుగోపాల్‌, కురుమూర్తి, మన్యం, రాగి అక్షయ్‌, రాములు, జానకీరాములు, లక్ష్మయ్య, పెంటన్న పాల్గొన్నారు.

యూరియా తిప్పలు.. చెప్పుల బారులు




మస్తీపురం ఎక్స్‌రోడ్‌లో పీఏసీఎస్‌ కౌంటర్‌ వద్ద యూరియా కోసం చెప్పులను వరుసలో పెట్టిన రైతులు

ఆత్మకూర్‌: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు సోమవారం ఉదయం నుంచి యూరియా కోసం చెప్పులు, పాస్‌పుస్తకాలను వరుస క్రమంలో పెట్టి పీఏసీఎస్‌ల వద్ద పడిగాపులు కాసారు. సాయంత్రం 5 గంటలకు ఒక లోడ్‌ 600 బ్యాగులు రావడంతో ఒక్కసారిగా రైతులు ఎగబడ్డారు. స్థానిక పోలీసులు కలుగజేసుకుని 215 మంది రైతులకు యూరియా పంపిణీ చేశారు. మిగిలిన 36 మంది రైతులకు టోకెన్లు అందించామని, మంగళవారం యూరియా అందిస్తామని ఏఓ వినయ్‌కుమార్‌, సీఈఓ నరేష్‌ తెలిపారు.

మధ్యాహ్నం 2 గంటలకు టోకెన్ల పంపిణీ

అమరచింత: పట్టణంలోని పీఏసీఎస్‌ కేంద్రాల వద్ద రైతులు సోమవారం తెల్లవారుజామున 5 గంటల నుంచే క్యూలైన్‌లో చెప్పులు, రాళ్లు పెట్టి నిల్చున్నారు. కానీ మధ్యాహ్నం 2 గంటలకు యూరియా రాదని చెప్పిన అధికారులు లైన్లలో నిల్చున్న రైతులకు టోకెన్లు అందించి, మంగళవారం యూరియా తీసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేసిన అన్నదాతలు పనులు వదులుకొని యూరియా కోసం ఇంకా ఎన్నాళ్లు తిరగాలని అధికారులను నిలదీశారు.



ఖిల్లాఘనపురం సింగిల్‌విండో కార్యాలయం వద్ద బారులు తీరిన రైతులు



ఆత్మకూర్‌లోని పీఏసీఎస్‌ వద్ద బారులుతీరిన రైతులు, వరుస క్రమంలో పెట్టిన చెప్పులు

కౌలు రైతు ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న కౌలు రైతును కాపాడుతున్న పోలీసు

ఖిల్లాఘనపురం: సాగు చేసుకున్న పంటకు సకాలంలో యూరియా వేసేందుకు అన్నదాతలు అరిగోసపడుతున్నారు. నాలుగు రోజులైనా తనకు యూరియా ఇవ్వడం లేదని ఓ కౌలు రైతు ఏకంగా సింగిల్‌విండో కార్యాలయంపైకి ఎక్కి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించిన ఘటన ఖిల్లాఘనపురంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయం వద్ద 15 రోజులుగా రెండు రోజులకు ఒకసారి యూరియా విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 7 గంటలకే వివిధ గ్రామాల నుంచి సుమారు 300 మంది రైతులు అక్కడికి చేరుకున్నారు. ఇదే సమయంలో ఖిల్లాఘనపురం గ్రామానికి చెందిన కౌలు రైతు బిక్కి చెన్నకేశవులు అక్కడికి వచ్చి యూరియా కోసం ఎదురు చూశాడు. అక్కడ పెద్ద సంఖ్యలో ఉన్న రైతులను చూసి ఇక తనకు యూరియా దొరకదని ఆందోళనకు గురై సింగిల్‌విండో కార్యాలయం పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకోవడానికి యత్నిస్తుండగా ఎస్‌ఐ వెంకటేష్‌ అప్రమత్తమై తన సిబ్బంది రక్షించారు.

మాదక ద్రవ్యాల వినియోగంతో దుష్ఫలితాలు



మాట్లాడుతున్న సీనియర్‌ సివిల్‌ జడ్జి రజని

కొత్తకోట రూరల్‌: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్‌ సివిల్‌ జడ్జి వి.రజిని అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని నివేదిత డిగ్రీ కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు తీసుకోవడం వలన మేథోపరమైన ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయన్నారు. మాదకద్రవ్యాలను విక్రయించడం, కొనుగోలు చేయడం చట్ట వ్యతిరేకమని, కేసులు నమోదవుతాయని తెలియజేశారు. గూగుల్‌లో నషా ముక్త్‌ భారత్‌ సైట్‌ను సందర్శించి డ్రగ్స్‌ తీసుకోం అని ప్రతిజ్ఞ చేయాలని సూచించారు. అదేవిధంగా కళాశాలలో యాంటీ ర్యాగింగ్‌ కమిటీని ఏర్పాటు చేయాలని, కమిటీ సభ్యుల వివరాలను నోటీస్‌ బోర్డులో ఉంచాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులతో తమ పిల్లలు ర్యాగింగ్‌కు పాల్పడరని అంగీకార పత్రం తీసుకోవాలని తెలియజేశారు. ఉచిత న్యాయ సలహాల కోసం 15100 టోల్‌ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్‌ న్యాయమూర్తి మోహన్‌కుమార్‌, కళాశాల డైరెక్టర్‌ సూరిబాబు, కళాశాల సిబ్బంది సహదేవుడు, వెంకటేష్‌ గౌడ్‌, విద్యార్థులు ఉన్నారు.

జిల్లాలో 30 పోలీస్‌ యాక్ట్‌ అమలు

వనపర్తి: శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా జిల్లావ్యాప్తంగా నెల రోజుల పాటు 30 పోలీస్‌ యాక్ట్‌–1861 అమలులో ఉంటుందని ఎస్పీ రావుల గిరిధర్‌ అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సోమవారం నుంచి ఈ నెల 30 వరకు యాక్ట్‌ అమలులో ఉన్నందున జిల్లాలో పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, ఫంక్షన్‌ హాల్‌లో కార్యక్రమాలు, బహిరంగ సభలు నిర్వహించరాదని సూచించారు. అనుమతులు లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజాజీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారితీసే సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమన్నారు. సోషల్‌ మీడియాలో అనవసరమైన విషయాలు, రాజకీయ నాయకుల, కుల, మతాల మధ్య చిచ్చు పెట్టే అంశాలను వ్యాప్తి చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్‌

ప్రజావాణికి 6 ఫిర్యాదులు

సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రావుల గిరిధర్‌ ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆరుగురు ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్ల సీఐ, ఎస్‌ఐలకు ఫోన్‌ చేసి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా పోలీసు సేవలను వినియోగించుకునేలా వారికి భరోసా కల్పించాలని సూచించారు.

కాంగ్రెస్‌ రౌడీయిజం మానుకోవాలి

- నేడు పట్టణ బంద్‌కు బీజేపీ పిలుపు



టౌన్‌ పీఎస్‌ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

వనపర్తి టౌన్‌: నియోజకవర్గంలో కాంగ్రెస్‌ దౌర్జన్యాలు పెరిగిపోయి నాయకులు రౌడీయిజం చెలాయిస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ విమర్శించారు. ప్రధానమంత్రి మోదీ మాతృమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు చేశాడని ఆరోపిస్తూ సోమవారం కాంగ్రెస్‌ అగ్రనేత రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వివేకానంద మార్గ్‌లో దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ ఆగడాలు వనపర్తిలో రోజురోజుకూ శృతిమించుతున్నాయని మండిపడ్డారు. చట్టాన్ని కాపాడే పోలీసులు కాంగ్రెస్‌పై ఒకలా, బీజేపీపై మరోలా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. నియోజకవర్గంలో ఎప్పుడూ లేని విష సంస్కృతికి కాంగ్రెస్‌ పునాదులు వేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతుంటే మహిళలు అని కూడా చూడకుండా అక్రమ కేసులతో వేధింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ నాయకులను అక్రమ కేసులతో వేధించడమే కాంగ్రెస్‌ పనిగా పెట్టుకుందని ఆరోపించారు. పోలీసులు, కాంగ్రెస్‌ వైఖరికి నిరసనగా మంగళవారం కేంద్ర బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రాహుల్‌ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేయడంతో బీజేపీ నాయకులను అరెస్ట్‌ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి, సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. జెడ్పీ మాజీ చైర్మన్‌ ఆర్‌.లోక్‌నాథ్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకట్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, వారణాసి కల్పన, నాయకులు శ్రీనివాసులు, పద్మ, సూరి, శివారెడ్డి, రామ్‌రెడ్డి, సరోజ, రాము, తిరుమలేష్‌, కరీం, రాయన్న సాగర్‌ పాల్గొన్నారు.

లొసుగులను తప్పించేందుకే సీబీఐకి అప్పగింత

పాలమూరు: కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ పార్టీలు లోపాయికారి ఒప్పందంలో భాగంగానే కాళేశ్వరంపై సీబీఐకి అప్పగించడానికి సిద్ధమయ్యాయని ఎంపీ డీకే అరుణ అన్నారు. జిల్లాకేంద్రంలోని పద్మావతికాలనీలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 19 నెలలు కాలయాపన చేసి ఇప్పుడు సీబీఐకి ఇస్తున్నానని చెప్పడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కాళేశ్వరంలో ఉన్న లొసుగులను గుర్తించి వాటన్నింటిని తప్పించడానికే సీబీఐని తెరముందుకు తెస్తున్నారన్నారు. కాళేశ్వరంపై విచారణ చేయడానికి సీబీఐకి అప్పగించిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఏ స్థాయిలో సహకరిస్తుందో తెలియదని, ఇదంతా లోపాయికారి ఒప్పందంలో భాగమే తప్పా వేరే ఏమీ లేదన్నారు. బీజేపీ మొదటి నుంచి కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్‌ చేసిందని గుర్తుచేశారు. ఎలాంటి రాజకీయాల కోసం కవిత డైలాగ్‌లు చెబుతుందో తెలియదు కానీ కాళేశ్వరంలో కేసీఆర్‌ కుటుంబ సభ్యుల అందరి పాత్ర ఉందని మనం భావించాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పద్మజారెడ్డి, పాండురంగారెడ్డి, అంజయ్య, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

క్లుప్తంగా

యోగాసనాలలో ఏఎస్‌ఐ వనజ ప్రతిభ



మహబూబ్‌నగర్ క్రైం: తెలంగాణ యోగాసన అసోసియేషన్ ఆధ్వర్యంలో అదిలాబాద్ జిల్లాలో నిర్వహించిన 6వ రాష్ట్రస్థాయి సీనియర్ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్ షిప్–2025 ట్విస్టింగ్ బాడీ– ఫార్వర్డ్ బెండింగ్ ఈవెంట్‌లో ఏఎస్‌ఐ వనజ ప్రతిభచాటారు. మొదటి స్థానంలో నిలిచిన ఆమెను సోమవారం ఎస్పీ డి.జానకి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సేవలతోపాటు క్రీడా రంగంలో కూడా ప్రతిభ కనబరచడం గర్వకారణం అన్నారు. ప్రతిభావంతులైన సిబ్బందికి పోలీస్ శాఖ ఎప్పుడూ ప్రోత్సాహం ఉంటుందని భవిష్యత్‌లో ఇంకా మంచి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.


65 మంది సీసీల బదిలీ

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): డీఆర్‌డీఓ శాఖ సెర్ప్ పరిధిలో పనిచేస్తున్న 65 మంది సీసీలను బదిలీ చేశారు. సోమవారం డీఆర్‌డీఓ నర్సింహులు వారికి కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగ్‌లను కేటాయించారు. ఇందులో క్లస్టర్ల పరిధిలో కౌన్సెలింగ్ ద్వారా వారు కోరుకున్న స్థానాలకు బదిలీ చేసినట్లు తెలిపారు. కౌన్సెలింగ్ అనంతరం ఆయా స్థానాల్లో జాయిన్ కావాలని డీఆర్‌డీఓ సూచించారు.

భూ నిర్వాసితులకు నష్ట పరిహారం చెల్లించాలి



కోడేరు: పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఏదుల రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన తీగలపల్లి గ్రామ భూ నిర్వాసితులకు నష్టపరిహారం వెంటనే చెల్లించాలని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట్‌రాములు డిమాండ్ చేశారు. సోమవారం కోడేరు మండలం తీగలపల్లిలో భూ నిర్వాసితులు నష్టపరిహారం చెల్లించాలని నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్ద కాలంగా భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం ఇప్పటి వరకు నష్టపరిహారం ఇవ్వకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. దాదాపు 70మంది రైతులు పరిహారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరిగినా అధికారులు స్పందించడం లేదన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించి నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 2013 భూసేకరణ చట్ట ప్రకారం భూ నిర్వాసితులకు ఎకరాకు రూ.60 లక్షలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహ, భూ నిర్వాసితులు ఆంజనేయులు, వెంకటయ్య, డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు శివశంకర్ వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ఆకాశం.. 'వర్ణ'నాతీతం

అప్పటి దాకా నీలివర్ణంలో ప్రశాంతంగా కనిపించిన ఆకాశం ఒక్కసారిగా ఎరుపు, పసుపు రంగుల్లోకి మారి చూపరులను కట్టిపడేసింది. సోమవారం సాయం సంధ్య వేళలో భానుడు వివిధ వర్ణాలతో మెరిసిపోతూ ఆకట్టుకున్నాడు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో సాయంత్రం 6.45 నుంచి 7.20 గంటల ప్రాంతంలో వర్ణనాతీతంగా కనిపించిన ఆకాశాన్ని 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి, సీనియర్ ఫొటోగ్రాఫర్, మహబూబ్‌నగర్

గొప్ప పోరాట యోధుడు.. సురవరం



మాట్లాడుతున్న సురవరం సుధాకర్‌రెడ్డి భార్య విజయలక్ష్మి, చిత్రంలో చాడ వెంకట్‌రెడ్డి, నిరంజన్‌రెడి, సంపత్‌కుమార్

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి
- ఆయన ఆశయ సాధనకు ప్రభుత్వం కృషి : మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్
- సురవరం సుధాకర్‌రెడ్డి స్వగ్రామం కంచుపాడులో సంస్మరణ సభ
- నివాళులర్పించిన పలు పార్టీల నాయకులు

ఉండవెల్లి: గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయ రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించి, నింగికెగిసిన నిస్స్పృహుడు, తెలంగాణ పోరాట యోధుడు సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి అని ఆ పార్టీ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉండవెల్లి మండలం కంచుపాడు గ్రామంలోని సురవరం వెంకట్రామిరెడ్డి విజ్ఞాన కేంద్రంలో సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభను ఉమ్మడి జిల్లా సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చాడా వెంకట్‌రెడ్డితో పాటు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సంపత్ కుమార్, అబ్రహం తదితరులు హాజరయ్యారు. ముందుగా సురవరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చాడా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. సురవరం సుధాకర్‌రెడ్డి జన్మభూమిని, కన్నతల్లిని మరువలేదని, సొంత గ్రామంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని, గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయిలో సామాన్యుడి సమస్యలపై గళం విప్పాడని కొనియాడారు. దేశంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో.. దేశానికి ప్రమాదం పొంచి ఉందని, మతోన్మాద, నియంతృత్వ పాలన సాగిస్తారని ముందే హెచ్చరించారని, అలాగే జరిగిందన్నారు. రాజ్యాంగాన్ని కాపాడాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి, పోరాటానికి వామపక్షాలు ఒకే వేదిక మీదికి రావాలన్నారు.

ఆయన పేరు చరిత్రలో నిలిచేలా చేస్తాం : సంపత్‌కుమార్

సురవరం సుధాకర్‌రెడ్డి ఆశయ సాధనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, ఆయన పేరును చరిత్రలో నిలిచేలా చేస్తామని మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన సంస్మరణసభలో సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి కంచుపాడులోని పలు సమస్యలను సురవరం సుధాకర్‌రెడ్డి భార్య విజయలక్ష్మి తీసుకురాగా 24 గంటల్లో ఆయా పనులు మంజూరు చేశారన్నారు. గ్రామంలోని యూపీఎస్‌ను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేస్తామని, రూ.కోటితో భవనం, హాస్టల్ నిర్మిస్తామని అన్నారు. సురవరం ఆశయ సాధన కోసం కృషిచేస్తున్న ఐదుగురికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, జాతీయ రహదారి నుంచి కంచుపాడుకు బీటీరోడ్డుకు రూ.3 కోట్లు మంజూరు చేశామన్నారు. ఈ అభివృద్ధి పనులకు సంబంధించి ప్రొసీడింగ్ కాపీలను ఈసందర్భంగా విజయలక్ష్మికి అందజేశారు.

ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి.. : మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

పార్టీలు పక్కన పెట్టి ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసి జాతీయ స్థాయికి ఎదిగిన గొప్ప వ్యక్తి సురవరం సుధాకర్ రెడ్డి అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం పోరాడి కంచుపాడు కామ్రేడ్‌గా శాశ్వతంగా మనలో ఉంటాడని అన్నారు. అనంతరం సురవరం భార్య విజయలక్ష్మి మాట్లాడుతూ సొంత గ్రామానికి ఏదో ఒకటి చేయాలని ఆయన నిత్యం తలచారని, డిగ్రీ కళాశాల, క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయడానికి సొంత పొలాన్ని అందజేస్తామని, ఇదే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానన్నారు. సురవరం విజ్ఞాన కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ.. రాజకీయంగా కాకుండా మంచి గురువుగా, ఉమ్మడి జిల్లాలో మా తండ్రి నుంచి పరిచయమైన గొప్ప వ్యక్తి సురవరం సుధాకర్‌రెడ్డి అని అన్నారు. మాజీ ఎమ్మెల్యే అబ్రహం సైతం నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ప్రేమ్ పావని, సురవరం సోదరి సరోజ, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్, కుమారులు కపిల్, సీపీఐ నాయకులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి వెళ్తుండగా అపశ్రుతి



ప్రమాదానికి గురైన ట్రాక్టర్



ప్రమాదానికి కారణమైన డీసీఎం

- హైవేపై ట్రాక్టర్‌ను ఢీకొన్న డీసీఎం
- ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం.. మరొకరి పరిస్థితి విషమం

ఎర్రవల్లి: వినాయకుడి నిమజ్జనానికి వెళ్తున్న ట్రాక్టర్‌ను డీసీఎం వేగంగా వచ్చి ఢీకొనడంతో అక్కడికక్కడే ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. అలాగే మరొకరి పరిస్థితి విషమంగా ఉండగా.. ఆరుగురికి గాయాలైన సంఘటన మండలంలోని కొట్టం కాలేజీ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి ఇటిక్యాల ఎస్‌ఐ రవినాయక్ కథనం ప్రకారం .. ఇటిక్యాలకు చెందిన బోయ జమ్మన్న(50), బోయ నర్సింహులు(48), అదే గ్రామానికి చెందిన మరో ఏడు మందితో కలిసి చెన్నకేశవస్వామి ఆలయం దగ్గర ఏర్పాటు చేసిన వినాయకుడిని బీచుపల్లి వద్ద కృష్ణానదిలో నిమజ్జనం చేసేందుకు ఆదివారం రాత్రి ట్రాక్టర్‌లో బయలుదేరారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై అర్ధరాత్రి సుమారు 2 గంటల ప్రాంతంలో కొట్టం కాలేజీ సమీపంలో వెళ్తుండగా కర్నూలు నుంచి హైదరాబాద్ వెళ్తున్న డీసీఎం వేగంగా వచ్చి ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ పల్టీలు కొట్టి రోడ్డు కిందకు దూసుకుపోవడంతో వినాయకుడితోపాటు అందులో ఉన్న వారంతా చెల్లాచెదురుగా పడిపోయారు. ప్రమాదంలో తీవ్ర రక్త గాయాలు కావడంతో బోయ జమ్మన్న అక్కడికక్కడే మృతిచెందగా, ఆస్పత్రికి తరలిస్తుండగా పరిస్థితి విషమించి బోయ నర్సింహులు మృత్యువాత పడ్డారు. అలాగే ప్రమాదంలో గాయాలపాలైన జ్ఞానేశ్వర్, నరేందర్, మహేందర్, రమేష్, రాముడు, యశ్వంత్, మధులను అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇందులో నరేందర్ తలకు తీవ్ర రక్త గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు. ఈ ఘటనపై జమ్మన్న భార్య పార్వతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. వినాయకుడి నిమజ్జనోత్సవంలో అపశ్రుతి చోటు చేసుకొని ఇద్దరు మృతిచెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.



జమ్మన్న (ఫైల్)



నర్సింహులు (ఫైల్)

మెడికల్ కళాశాలకు నేత్రాల అప్పగింత

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నర్సింహులు నేత్రాలను కుటుంబ సభ్యులు కర్నూలు మెడికల్ కళాశాలకు అందజేశారు. నర్సింహులు భార్య లక్ష్మి, కుమారుడు నవీన్, కుమార్తె పూజిత తమ కుటుంబంలో పెద్ద దిక్కును కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్నా దుఃఖాన్ని దిగమింగుకొని మరో వ్యక్తి జీవితంలో వెలుగులు నింపడం కోసం మృతుని నేత్రాలను దానం చేసి మానవత్వం చాటుకున్నారు.

పీయూలో సిబ్బందికి క్రీడా పోటీలు



షెటిల్ ఆడుతున్న వీసీ శ్రీనివాస్, ఆడిట్‌సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్

పాల్గొన్న వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేష్‌బాబు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూర్ యూనివర్సిటీలోని ఇండోర్ స్టేడియంలో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి మంగళవారం క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీల్లో పీయూ వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేష్‌బాబు పాల్గొని షెటిల్ ఆడారు. ఈ సందర్భంగా వీసీ శ్రీనివాస్ మాట్లాడుతూ రోజువారీ బిజీ జీవితంలో సిబ్బంది ఆఫీస్ పనుల్లో ఉండి క్రీడలు, శారీరక శ్రమ దూరంగా ఉంటున్నారన్నారు. ఈ క్రమంలో ఈ పోటీలను నిర్వహించడం వల్ల సిబ్బంది ఆరోగ్యం, మానసికంగా ఎంతో మేలు చేస్తుందన్నారు. ఎవరైతే ప్రతిరోజు ఆటలు, కీడల్లో పాల్గొంటారో వీరి జీవిత కాలం పొడిగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ఆడిట్‌సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్, రవికాంత్, అర్జున్‌కుమార్, పీడీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్ కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సస్పెండ్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలోని మహమ్మదాబాద్ కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ శివలీలను సస్పెండ్ చేస్తూ డీఈఓ ప్రవీణ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. శివలీలను గండేడ్ మోడల్ స్కూల్‌కు ఇన్‌చార్జ్‌గా వ్యవహరించాలని డీఈఓ గతంలో ఆదేశాలు జారీ చేశారు. అయితే ఆమె మోడల్ స్కూల్‌లో రిపోర్టు చేయకపోగా బాధ్యతలు సైతం తీసుకోలేదు. దీంతో పలుమార్లు డీఈఓ పిలిచి బాధ్యతలు తీసుకోవాలని, వెంటనే ఆగస్టు నెల బిల్లులు చేయాలని ఆదేశించినా పట్టించుకోలేదు. దీంతో మోడల్ స్కూల్ సిబ్బందికి సంబంధించి ఆగస్టు నెల వేతనాలు, బిల్లులు కాలేదని తెలుస్తుంది. ఈ విషయమై డీఈఓ ప్రవీణ్‌కుమార్‌ను వివరణ కోరగా శివలీలకు మోడల్ స్కూల్ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించగా పట్టించుకోకపోవడంతో సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు.

పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలి

- జోగుళాంబ జోన్– 7 డీఐజీ ఎల్ఎస్ చౌహాన్



పెబ్బేరు పోలీస్‌స్టేషన్‌లో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఐజీ చౌహాన్

వనపర్తి: పోలీసులు ఎల్లవేళలా స్టేషన్లలో అందుబాటులో ఉండి బాధితులకు రక్షణగా ఉండాలని జోగుళాంబ జోన్– 7 డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం ఆయన జిల్లాలోని పెబ్బేరు, చిన్నంబావి, పెద్దమందడి పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేశారు. అంతకముందు ఎస్పీ రావుల గిరిధర్ పుష్పగుచ్చం అందించి డీఐజీకి స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రికార్డులు, రిసెప్షన్, లాకప్, మెన్ బ్యారెక్, టెక్నికల్ రూం, పరిసరాలను పరిశీలించారు. ఎక్కువగా జరిగే నేరాలు, వాటి ప్రాంతాలు, కేసుల నమోదు వివరాలు, నేరస్తుల ప్రస్తుత పరిస్థితుల గురించి ఆయా స్టేషన్ల ఎస్‌ఐలతో ఆరా తీశారు. గ్రామాల్లో, పట్టణాల్లో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే తనిఖీ చేయాలని సూచించారు. నిరంతరం పెట్రోలింగ్ చేస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనాల తనిఖీలు నిర్వహించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. విధి నిర్వహణలో ప్రతి పోలీసు నిబద్ధతతో ఉండాలని, తమకు కేటాయించిన విధిని సక్రమంగా నిర్వహించినప్పుడే అధికారులు, ప్రజల నుంచి మన్ననలు పొందుతారని, చేసిన పనికి గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వరావు, సీఐలు కృష్ణయ్య, రాంబాబు, ఎస్‌ఐలు యుగంధర్ రెడ్డి, జగన్, శివకుమార్, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

జలాశయాలకు నిలకడగా వరద

- జూరాలకు 1,56,615 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 20 గేట్లు ఎత్తి దిగువకు 1,70,534 క్యూసెక్కులు
- కొనసాగుతున్న విద్యుదుత్పత్తి



శ్రీశైలంలో పదిగేట్ల ద్వారా సాగర్‌కు పరుగులు పెడుతున్న కృష్ణమ్మ

ధరూరు/ఆత్మకూర్/మదనాపురం/దేవరకద్ర/దోమలపెంట: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద తగ్గుముఖం పడుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆదివారం ప్రాజెక్టుకు 2లక్షల 14వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. సోమవారం సాయంత్రం 7:30 గంటల వరకు ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో లక్షా 56వేల 615 క్యూసెక్కులకు తగ్గినట్లు పేర్కొన్నారు. దీంతో ప్రాజెక్టు 20 క్రస్టు గేట్లను ఎత్తి గేట్ల ద్వారా లక్షా 36వేల 240 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుదుద్పత్తి నిమిత్తం 32వేల 171 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 67 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 920 క్యూసెక్కులు, కుడి కాలువకు 386 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం లక్షా 70వేల 534 క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9,657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 8,048 టీఎంసీల నిల్వ ఉన్నట్లు తెలిపారు.

శ్రీశైలం నుంచి సాగర్‌కు పరుగులు

ఎగువ ప్రాంతాల నుంచి నీటిప్రవాహం కొనసాగుతుండడంతో శ్రీశైలం ఆనకట్ట వద్ద ఎత్తి ఉంచిన పది గేట్లు సోమవారం కొనసాగుతున్నాయి. జూరాలలో ఆనకట్ట గేట్లు పైకెత్తి స్పిల్‌వే ద్వారా 1,36,240, విద్యుదుత్పత్తికి 32,171, సుంకేసుల నుంచి 66,752 మొత్తం 2,35,163 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయం వస్తున్నాయి. శ్రీశైలంలో ఆనకట్ట పదిగేట్లు పైకెత్తి స్పిల్‌వే ద్వారా 2,67,440 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. మరోవైపు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,288 మొత్తం 65,603 క్యూసెక్కులను అదనంగా సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 882.1 అడుగుల నీటి మట్టం వద్ద 199.7354 టీఎంసీల నిల్వ ఉంది. 24గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 27,000, హెచ్ఎన్ఎస్ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2,489 క్యూసెక్కులను విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 16.765 మిలియన్ యూనిట్లు, కుడిగట్టు కేంద్రంలో 15.215 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు.

పూర్తిస్థాయి నీటిమట్టానికి రామన్‌పాడు

రామన్‌పాడు జలాశయంలో సోమవారం నాటికి పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 390 క్యూసెక్కులను వదులుతూ సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 925 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వ ద్వారా 55 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ఊకచెట్టు వాగు, సరళాసాగర్ ద్వారా వరద వస్తుండడంతో ఒక గేటు ఎత్తి 2,500 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నామని ఏఈ వరప్రసాద్ తెలిపారు.

కోయిల్‌సాగర్ గేట్ల బంద్

కోయిల్‌సాగర్ గేట్లను సోమవారం ఉదయం నుంచి మూసి వేశారు. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గి పోవడంతో ఆదివారం తెరిచిన ఒక గేటును మూసి వేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 32.6 అడుగులు ఉండగా ప్రస్తుతం 32అడుగులుగా ఉంది. నీటి సామర్థ్యం 2.27 టీఎంసీలు కాగా ప్రస్తుతం 2.2 టీఎంసీల నిల్వ ఉంది.

లక్ష్యానికి చేరువలో విద్యుదుత్పత్తి



జూరాల నుంచి 20 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వర నీరు

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు జలవిద్యుదుత్పత్తి కేంద్రాల ద్వారా ఈ ఏడాది రికార్డుస్థాయిలో విద్యుదుత్పత్తి పరుగులు పెడుతుంది. జలవిద్యుత్ ప్రాజెక్టులు ప్రారంభమైనప్పటి నుంచి మే నెలలోనే విద్యుదుత్పత్తి ప్రారంభించి రికార్డు సృష్టించారు. ఈ ఏడాది సెప్టెంబర్ ఒకటో తేదీ నాటికి 565 మిలియన్ యూనిట్లను సాధించారు. కాగా, ఈ ఏడాది 2025–26 సంవత్సరానికిగాను 610 ఎంయూ టార్గెట్ ఉంది. ఎగువ కర్ణాటక, మహారాష్ట్రలో వర్షాలు భారీస్థాయిలో కురుస్తుండడంతో నారాయణపూర్, ఆల్మట్టి ప్రాజెక్టుల నుంచి జూరాలకు వరదనీరు చేరుతుండడంతో విద్యుదుత్పత్తి లక్ష్యానికి చేరువలో ఉంది. సోమవారం 12 యూనిట్ల ద్వారా ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు ఎగువలో 6యూనిట్ల ద్వారా 234 మెగావాట్లు, 269.017 ఎంయూ, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 296.310 ఎంయూ ఉత్పత్తి చేస్తున్నామని వివరించారు.

అతివేగమే ప్రమాదానికి కారణమా..?

ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టిన ట్రావెల్ బస్సు



వివరాలు సేకరిస్తున్న అడ్డాకుల పోలీసులు

మహబూబ్‌నగర్ క్రైం/అడ్డాకుల: అడ్డాకుల మండల సమీపంలోని కాటవరం స్టేజీ వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృత్యువాత పడగా.. మరో ఐదుగురు గాయపడ్డారు. అయితే ట్రెయిలర్ లారీని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొట్టిన ఘటనలో బస్సును డ్రైవర్ అతివేగంగా నడపడమే కారణంగా తెలుస్తోంది. ప్రమాదం ప్రయాణికులు ఎక్కించే డోర్ వైపు జరగడం వల్ల డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. బస్సు ముందు వరుస భాగంలో కూర్చున్న వారికే ఎక్కువ నష్టం జరిగింది. లారీ వెనుక బస్సు ఢీకొట్టిన సమయంలో బస్సు లెఫ్ట్ సైడ్ ఎక్కువ భాగం లోపలి వరకు దెబ్బతింది. దీంతో పాటు చాలా వరకు లారీలను రాత్రివేళ దాబాల వద్ద నిలుపుతుంటారు. అయితే ప్రమాద స్థలం వద్ద కూడా దాబా హోటల్ ఉండటంతో లారీని ఇక్కడ నిలిపేందుకు డ్రైవర్ దాన్ని స్లో చేసి ఉంటాడనే అనుమానం వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే వేగంగా వచ్చిన బస్సు అదుపు తప్పి లారీని ఢీకొట్టి ఉండవచ్చని స్థానికులు చెబుతున్నారు.

మధ్య తరగతి కుటుంబాలే..

ఈ ప్రమాదంలో మృతి చెందిన వారిలో హసన్ పెయింటర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. ఇతడి మృతితో పిల్లలు అనాథలుగా మారారు. నంద్యాలకు చెందిన అస్రాఫ్ ఉన్నీసా హైదరాబాద్‌లోని హాఫీజ్ పేట్‌లో ఉండే కొడుకు ఫిరోజ్ భాష దగ్గరి నుంచి నంద్యాలకు వెళ్తూ మృతి చెందింది. నంద్యాలకు చెందిన సుబ్బరాయుడు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇక ఎల్లమ్మ హైదరాబాద్‌లో ఓ హోటల్‌లో దినసరి కూలీగా పనిచేస్తూ కొడుకును చదివిస్తోంది. ఆమె కుమారుడు పదేళ్ల సంతోష్ నాలుగో తరగతి చదువుతుండగా.. ఇటీవల తండ్రి కూడా చనిపోవడంతో అనాథగా మారాడు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

గద్వాల క్రైం: మండలంలోని బిజ్వారం గ్రామానికి చెందిన వెంకటేష్ (25) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు గత కొన్ని రోజులుగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యులకు చూయించినప్పటికీ ఫలితం లేకపోయింది. అయితే గత నెల 17న ఇంటి నుంచి వెళ్లిపోయిన వెంకటేష్ తిరిగిరాలేదు. దీంతో యువకుడి తండ్రి మల్దకల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో సోమవారం గద్వాల మండలం పరుమాలలో చెట్టుకు యువకుడు ఉరేసుకున్నట్లు గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు మృతుడు వెంకటేష్‌గా నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నందికర్ తెలిపారు.